బాధిత కుటుంబాలకు మాజీ ఎంపీ రావుల, జెడ్పీచైర్మన్ పరామర్శ

బీఆర్ఎస్ నాయకుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాయకులు

వనపర్తి, జనవరి 21: పట్టణంలోని పలువురు బాధిత కుటుంబాలను మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డితో కలిసి ఆదివారం పరామర్శించారు. పట్టణంలోని జర్నలిస్టు పోలిశెట్టి బాలకృష్ణ బ్రదర్స్ ఇంటికి వెళ్లి వారి తల్లి సులోచనమ్మ మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం రాంనగర్ కాలనీలోని గట్టు వెంకన్న కుమారుడు గట్టుదినేశ్ వారం రోజుల కిందట అమెరికాలో ఆకాల మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. అలాగే బీఆర్ఎస్ నాయకుడు బాలపీరు చెల్లెలు బాలకృష్ణమ్మ మృతి చెందడం చాలా బాధించిందన్నారు. అలాగే చికిత్స పొందుతున్న మాజీ సర్పంచ్ రాజశేఖర్‌గౌడ్ కుమారుడు రేవంత్‌గౌడ్‌ను పరామర్శించారు.కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్ పాకనాటి కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు అశోక్, నందిమల్ల రమేశ్, ఎండీ గౌస్ సయ్యద్, జమీల ఫజల్, ఖాదర్, బాలునాయుడు, నాగరాజు, బీచుపల్లియాదవ్, మాజీ కౌన్సిలర్ ఇందిరమ్మ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి: జెడ్పీ చైర్మన్

వనపర్తి, జనవరి 21: ప్రజలు ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నిషేధించాలని జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి సూచించారు. ఆదివారం పట్టణంలోని హనుమాన్ టేకిడిలో ప్రేమ్ టైలర్ సామాజిక కార్యకర్త మణ్యం ఆధ్వర్యంలో గన్నీ బ్యాగుల పంపిణీ కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ హాజరై పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పలుస రమేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న కలెక్టర్

ఇటిక్యాల, జనవరి 21 : మండలంలోని పెద్దదిన్నె గ్రామంలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం స్వామివారిని కలెక్టర్ సంతోష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ధర్మకర్త స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించి ఆశీస్సులు అందజేశారు. అంతకుముందు కలెక్టర్‌కు ఆలయ ధర్మకర్తజ యసింహ, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

ముగిసిన భజన పోటీలు

లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి సన్నిధిలో శనివారం రాత్రి నిర్వహించిన భజన పోటీలు ముగిశాయి. పోటీల్లో 14 బృందాలు పాల్గొనగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా గుర్రంపాడ్ లక్ష్మీనరసింహస్వామి భజన మండలి మొదటి బహుమతి రూ.20వేలు అందుకున్నారు. రెండవ ,మూడవ బహుమతులు కర్నూల్ జిల్లా శంకరాపురం, ఉయ్యాలవాడ భజన బృందాలు, నాల్గవ బహుమతి పర్దీపురం, ఐదవ, ఆరవ బహుమతి మారుతి, నక్కలపల్లె, తుమ్మిల్ల భజన మండలికి అందజేసినట్లు ఆలయ ధర్మకర్త జయసింహ తెలిపారు. సోమవారం రాత్రి పెద్దతేరు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చాలి

- డీఈవో గోవిందరాజులు

వనపర్తి టౌన్, జనవరి 21 : ఈనెల 22న ఆన్‌లైన్‌లో జరిగే రాష్ట్రస్థాయి ప్రదర్శనలో ప్రతిభ చాటాలని డీఈవో గోవిందరాజులు విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 51వ బాల వైజ్ఞానిక ప్రదర్శనలు జిల్లాస్థాయిలో అన్ని పాఠశాలల విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్నారని జిల్లాస్థాయి ప్రదర్శనలో 103 ప్రాజెక్టులు ప్రదర్శనలను ప్రదర్శించారని అందులో సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ సొసైటీ అనే ప్రధానాంశంపై ఉపాంశాలను ఎంపిక చేసుకొని నిర్వహించామన్నారు. ఆరోగ్య విభాగంలో జూనియర్స్ నుంచి కొత్తకోటకు చెందిన సి.అక్షయ గురుకుల విద్యార్థిని, సీనియర్స్ విభాగం నుంచి జగత్‌పల్లి ఉన్నత పాఠశాలకు చెందిన భువనేశ్వరి, జీవనశైలి విభాగంలో జూనియర్స్ నుంచి జిల్లా కేంద్రంలోని మదర్స్‌ల్యాబ్ ఉన్నత పాఠశాలకు చెందిన హిమాద్, సీనియర్ విభాగంలో వనపర్తి బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన గాయత్రీ, వ్యవసాయ విభాగంలో జూనియర్స్‌లో యూపీఎస్ రామకృష్ణాపురం పాఠశాలకు చెందిన పి.అమృత, సీనియర్స్ విభాగంలో ప్రతిభ ఉన్నత పాఠశాల వనపర్తికి చెందిన లహరి, రవాణా విభాగంలో జూనియర్స్ నుంచి మోడల్ స్కూల్ ఖిల్లాఘణపురానికి చెందిన శ్రీవిద్య , సీనియర్స్ విభాగంలో అక్షర మోడల్ స్కూల్ వనపర్తికి చెందిన అమీనా సమరిన్, గణన నైపుణ్యాలకు సంబంధించిన విభాగంలో జూనియర్స్‌లో యూపీఎస్ గోపులపురం పాఠశాలకు చెందిన ఎం.భాస్కర్, సీనియర్స్ విభాగంలో కొత్తకోట బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన మౌనిక, ఉపాధ్యాయ విభాగంలో జూనియర్స్ విభాగంలో రామకృష్ణాపురం యూపీఎస్ పాఠశాలకు చెందిన పి.మురళీకృష్ణలు విజేతలుగా నిలిచారని, వీరు రాష్ట్రస్థాయి ప్రదర్శనలో గూగుల్ లింక్‌లో తమ ప్రదర్శనలను అప్‌లోడ్ చేయాలని తెలిపారు. రాష్ట్రస్థాయి ప్రదర్శనలో ప్రతిభ కబనబర్చి విజేతలుగా నిలవాలని డీఈవో సూచించారు.

విద్యార్థులు శాస్త్రీయంగా ఆలోచించాలి

వనపర్తి టౌన్, జనవరి 21: విద్యార్థులు శాస్త్రీయంగా ఆలోచించాలని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు నరేందర్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలో ఎస్ఎఫ్ఐ జిల్లాస్థాయి వైజ్ఞానిక శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రీయ ఆలోచనలు అనే ఆంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ అవగాహన పెంచుకోవడంతో మూఢ నమ్మకాలను పారద్రోలవచ్చన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జబ్బార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆది, ఉపాధ్యక్షులు మొగిలి, నాయకులు మల్లేశ్, వీర ప్రసాద్, నందు, రాహుల్, స్వప్న, శ్రీలత, ఉష, సురేఖ ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కొత్తకోట, జనవరి 21 :గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం మండల పరిధిలోని కడుకుంట్ల స్టేజీ సమీపంలో 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకున్నది. ఎస్సై మంజునాథ్‌రెడ్డి కథనం నాటవెల్లి గ్రామానికి చెందిన బానాల శ్రీనివాసులు(54) శనివారం రాయినిపేట గ్రామానికి తమ బంధువుల ఇంట్లో శుభకార్యానికి వచ్చారు. తిరిగి తెల్లవారుజామున స్వగ్రామానికి నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

వడ్డేపల్లి, జనవరి 21: మండల పరిధిలోని కొంకల గ్రామానికి చెందిన పాండు ఇంట్లో రేషన్ బియ్యం డంపు చేసినట్లు సమాచారంతో ఆదివారం తనిఖీ చేసి12 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ రాజవర్ధన్‌రెడ్డి తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

EDUCATION
★Admissions: రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, M.Tech, D-Pharma, B.Pharma, B.Sc. (Agri.), B.Sc. (Nursing), B.Ed, B.Ped, MBA, MCA. Eligible for all Jobs. Ph: 8866977112, 339.
NT-319803-All

WANTED
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-319418-All

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

ఓటరు నమోదు పారదర్శకంగా ఉండాలి

- జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్‌కుమార్
- ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి : అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్
- ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాల పరిశీలన

ఓటరునమోదు వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ సంతోష్ కుమార్

ఎర్రవల్లి చౌరస్తా, జనవరి 21: ఓటరు నమోదు ప్రక్రియ పారదర్శకంగా ఉండాలనిజోగులాంబ గద్వాల జిల్లాకలెక్టర్ సంతోష్ కుమార్ బీఎల్వోలకు సూచించారు. ఆదివారం ఆయన ఎర్రవల్లి చౌరస్తా పదోపటాలం లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటరు నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని బీఎల్వోలకు సూచించారు. ఫారం 6,7,8 అవసరం మేరకు ఉన్నాయలేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ నందిని, ఆర్ఐ నరేశ్, అంగన్‌వాడీ టీచర్లు శారద, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఓటరు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

అయిజ, జనవరి 21 : ఓటరు నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ బీఎవ్వోలను ఆదేశించారు. ఆదివారం పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటరు నమోదు కోసం వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఫారం 6,7,8 పెండింగ్ లేకుండా చూడాలన్నారు. తుది ఓటరు జాబితా ముద్రణకు ముందే దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. డబుల్ ఓటర్లు, మరణించిన ఓటర్లను తొలగించాలన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలన్నారు. ఓటరు నమోదుకు వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో బీఎల్వోలు పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఓటరు జాబితాలో సవరణ, పోలింగ్ కేంద్రం మార్పు వంటి వాటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ఈ నెల 25న విద్యా సంస్థలతోపాటు కార్యాలయాల్లో 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓటుహక్కు ప్రాధాన్యతపై విద్యాసంస్థల్లో చర్చలు, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు. ఓటరు దినోత్సవంలో ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేయాలని ఆర్డీవో అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తాసీల్దార్ సాహెదా బేగం, ఆర్ఐ దుర్గాసింగ్, మద్దిలేటి, బీఎల్వోలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మల్దకల్, జనవరి 21 : మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలోని 149, 150, 151, 152 పోలింగ్ బూత్‌లను ఆదివారం అదనపు కలెక్టర్ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బీఎల్‌వోలతో మాట్లాడుతూ మృతి చెందిన ఓటర్లు ఉంటే డెత్ సర్టిఫికెట్ ఆధారంగా తీసి వేయాలన్నారు. అలాగే డబుల్ ఓట్లు ఉంటే ఓటర్ల ఇష్టం మేరకు ఎక్కడ తొలగించాలో వారికి సమాచారం తీసివేయాలన్నారు. ఆయన వెంట తాసీల్దార్ హరికృష్ణ, ఆర్ఐ రామకృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటుహక్కు కల్పించాలి

మానవపాడు, జనవరి 21: 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలని ఆర్డీవో చంద్రకళ బీఎల్వోలకు సూచించారు. ఆదివారం ఆమె మండలంలోని అమరవాయి, మానవపాడు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటరు నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని సిబ్బందికి సూచించారు. ఆర్డీవో వెంట తాసీల్దార్ జుబేర్ మైనొద్దీన్, డిప్యూటీ తాసీల్దార్ ధరణిషా, గిర్దావర్ రజనీకాంత్ రెడ్డి ఉన్నారు.

గద్వాలలో..

గద్వాల రూరల్, జనవరి 21 : జిల్లా కేంద్రంలోని పలు పోలింగ్ బూతులను ఆదివారం తాసీల్దార్ వెంకటేశ్వర్లు పరిశీలించారు.మున్సిపాలిటీలోని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మోహిన్‌మొల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో డీటీ ఝాన్సీ,ఆర్ఐ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదుకు స్పందన

అలంపూర్, జనవరి 21 : రెండు రోజులుగా కొనసాగిన ప్రత్యేక ఓటరు నమోదుకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. మండలంలో మొత్తం 35 పోలింగ్ కేంద్రాలుండగా ఫాం 6లో 44, ఫాం 7లో 9, ఫాం 8లో దరఖాస్తులు స్వీకరించినట్టు డీటీ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

పాన్‌గల్‌లో..

పాన్‌గల్, జనవరి 21 : ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని శాగాపూర్, మాధవరావు పల్లి గ్రామాల్లో ఆదివారం ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాలను డిప్యూటీ తాసీల్దార్ అశోక్‌కుమార్ పరిశీలించారు. ఫారం-6 ద్వారా 29 దరఖాస్తులు, ఫారం-8 ద్వారా 18 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు.

ఆత్మకూర్‌లో..

ఆత్మకూరు, జనవరి 21 : మండలంలోని అన్ని గ్రామాల్లో 18ఏండ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని తాసీల్దార్ రాజు కోరారు. ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం జూరాల, మేడెపల్లి పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 1వ తేదీ వరకు 18ఏండ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. అన్ని గ్రామాల్లో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని అర్హులు దరఖాస్తులను అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ నాగేంద్రప్రసాద్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

నేడు బీరలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

అయిజ, జనవరి 21 : మండలంలోని పులికల్ గ్రామంలో దాదాపు రూ. కోటి వ్యయంతో నిర్మించిన ఆలయంలో సోమవారం బీరలింగేశ్వరస్వామి, పార్వతిదేవి, గణపతి, నందీశ్వర, కనకదాసు విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. సోమవారం ఉదయం 6.05 గంటలకు యంత్రప్రతిష్ఠ, విగ్రహాల ప్రాణప్రతిష్ఠ చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలకు భక్తులు అశేష సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు.

నేడు మాంసం దుకాణాలు బంద్

వనపర్తి టౌన్, జనవరి 21: అయోధ్య రామ మందిరం ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని వనపర్తి జిల్లా కేంద్రంలో మాంసం దుకాణాలను మూసి ఉంచాలని మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్ సర్క్యులర్‌ను జారీచేశారు. అన్ని మాంసం దుకాణాలు, హోటళ్ల యజమానులకు సర్క్యులర్‌ను జారీచేశారు.

రక్తదాన శిబిరం..

ఖిల్లాఘణపురం, జనవరి 21 : అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం మండలకేంద్రంలోని కుమ్మరిగేరిలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రామభక్తులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో శిబిరం ఉదయం 11గంటల నుంచి 4గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా సాయంత్రం అఖండ భజన కార్యక్రమాలను కూడా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

విద్యుత్ కంట్రోల్ రూంల ఏర్పాటు

వనపర్తి, జనవరి 21 : జిల్లాలో విద్యుత్ సమస్య పరిష్కారానికికంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు విద్యుత్ సూపరింటెండెంట్ నాగేంద్రకుమార్, డివిజనల్ ఇంజినీర్ నరేంద్రకుమార్ ఆదివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారం, విద్యుత్ ప్రమాదాల నివారణకు కంట్రోల్ రూంకు సమాచారం అందించే విధంగా రెండు కంట్రోల్ రూంలను జిల్లాలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ కార్యాలయంలోని కంట్రోల్ రూం 7382605 903, మరొక కంట్రోల్ రూం విద్యుత్ డివిజనల్ ఇంజినీర్ కార్యాలయంలో 7382614830 నెంబర్‌లతో వినియోగదారులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి టౌన్, జనవరి 21: మైనార్టీ గురుకుల కళాశాల్లో 2024-25 విద్య సంవత్సరానికి ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీధర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. వనపర్తి మైనార్టీ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో 80సీట్లు అందుబాటులో ఉన్నాయని , ఫిబ్రవరి 6వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్ www. tmriestelangana.cgg. gov. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అంబులెన్స్‌లో ప్రసవం

అమరచింత, జనవరి 21 : బతుకు దెరువు కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ఎర్రగొండపాలెం నుంచి అమరచింత మండలానికి వలస వచ్చిన శ్రావణికి శనివారం అర్ధరాత్రి పురిటి నొప్పులు రావడంతో ప్రసవం కోసం ఆత్మకూర్ ప్రభుత్వ దవాఖానకు వెళ్లింది. పరీక్షించిన వైద్యులు కడుపులో పిండం మెడకు పేగు చుట్టుకుందని సిజేరియన్ చేస్తేనే ప్రసవం సాధ్యమవుతుందని జిల్లా దవాఖానకు రెఫర్ చేశారు. అంబులెన్స్‌లో జిల్లా దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటినొప్పులు ఎక్కువ కావడంతో ఈఎన్టీ యశోధ ప్రసవం చేయగా శ్రావణి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉండడంతో అంబులెన్స్ పైలట్ రాముడు, ఈఎన్టీ యశోధ మహిళను జిల్లా దవాఖానలో చేర్పించారు.

పేకాట స్థావరంపై దాడి

మల్దకల్, జనవరి 21 : మండలంలోని మద్దెలబండ గ్రామ శివారులో ఆదివారం పేకాట స్థావరంపై దాడులు చేసినట్లు ఎస్సై కల్యాణ్ కుమార్ తెలిపారు. ఎస్సై కథనం మేరకు గ్రామ శివారులో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు సిబ్బందితో దాడులు చేశామన్నారు. అ దాడిలో ఐదు గురిని అదుపులోకి తీసుకున్నామని, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. కాగా రూ.21, 200 నగదుతోపాటు 5 బైక్‌లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఏడుగురిపై కేసులు నమోదు చేశామన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

చిన్నంబావి, జనవరి 21 : మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని ఎస్సై కృష్ణ ఓబుల్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, ఇస్తే తల్లిదండ్రులతో పాటు మైనర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

- శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ వీక్షించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు

వనపర్తి టౌన్, జనవరి 21 : అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని సోమవారం జిల్లావ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వ హించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేశారు. జిల్లావ్యాప్తంగా ఉన్న రామాలయాలు, ప్రసిద్ధి చెందిన ఆలయాల వద్ద పరిసరాలను శుభ్రం చేశారు. ముఖ్యంగా రామాలయం, చింతల హనుమాన్ ఆలయం, వెంకటేశ్వర ఆలయం, అభయాంజనేయస్వామి ఆలయాలు, శివాలయాలలో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. ఉదయం 6గంటలకు ఆలయాల్లో ఉన్న దేవతామూర్తులకు అభిషేకాలు, పుష్పా ర్చన, ఉదయం 10గంటల నుంచి రాత్రి 8గంటల వరకు అఖండ భజన, ప్రత్యేక భజన బృందాలతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం అన్నదాన ప్రసాద వితరణ నిర్వహించనున్నారు. సాయంత్రం ప్రతి ఇంట్లో దేవుని గుడిలో రెండు దీపాలు, గుమ్మం ఎదుట గడప వద్ద రెండు దీపాలు, తులసి మాత వద్ద ఒక దీపం వెలిగించాలని విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. భక్తులు ఆలయాలకు చేరుకొని పూజ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకులు , వికాస తరంగిణి నిర్వాహకులు వెల్లడించారు.

ఆదిశిలా క్షేత్రంలో..

మల్దకల్, జనవరి 21 : అయోధ్యలో శ్రీరాములు వారి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని సోమవారం ఆదిశిలా క్షేత్రంలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం నుంచి సీతారామ లక్ష్మణ పంచలోహ విగ్రహాలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు, భజనలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈవో సత్య చంద్రారెడ్డి తెలిపారు. ఆలయంలోని అన్నదాన సత్రంలో ఉదయం 9గంటలకు విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. అలాగే మండల కేంద్రంలోని బజారులోని ఆంజనేయ ఆలయం, దశమికట్ట వద్ద గల సీతారామాంజనేయ ఆలయాలతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఆలయాలన్నీ ముస్తాబు చేశారు.

శ్రీరాముడి శోభాయాత్ర..

ఆత్మకూరు, జనవరి 21 : అయోధ్య భవ్యమందిరంలో రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన జరగనున్న నేపథ్యంలో పట్టణంలో పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు హిందూ బంధువులు తెలిపారు. స్థానిక పీజేపీ క్యాంపు ఆంజనేయస్వామి ఆలయం నుంచి బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయం వరకు శ్రీరాముడి శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయోధ్యలో ప్రతిష్ఠాపనోత్సవాన్ని ప్రజలందరూ తిలకించేందుకు బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో భారీసైజులో డిజిటల్ స్క్రీన్ ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పట్టణ ప్రజలందరికీ అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, సంఘ్ పరివార్, హిందూ వాహిణి నేతృత్వంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మల్లాపురం దేవస్థానం, పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరం, స్పటిక లింగేశ్వరాస్వామి ఆలయం, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయం, తదితర ఆలయాల్లోనూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, ప్రాణప్రతిష్ఠ వీక్షిం చేందుకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

రాములోరి కల్యాణం..

ఇటిక్యాల, జనవరి 21: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని మండలంలోని బీచుపల్లి క్షేత్రంలోని కోదండరామాలయంలో సోమవారం సీతారాముల కల్యాణం జరిపించనున్నట్లు ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు ఆదివారం ప్రకటనలో తెలిపారు. కన్నుల పండువగా నిర్వహించే కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.

ముస్తాబైన ఆంజనేయస్వామి ఆలయం

ఉత్సవాలకు ఏర్పాట్లు

పెబ్బేరు, జనవరి 21 : అయోధ్యలో శ్రీరాముని ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా పెబ్బేరు పట్టణంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని తిలకించేందుకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో పెద్ద పెద్ద ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు నీడనిచ్చేందుకు టెంట్లు, తాగు నీరు ఏర్పాటు చేశారు. అన్నదానం కార్యక్రమంతోపాటు పురవీధుల్లో భారీ శోభాయాత్ర నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ముస్తాబైన ఆలయాలు ..

కొత్తకోట, జనవరి 21 : పట్టణంలోని రామాలయం, కోట్ల ఆంజనేయస్వామి ఆలయంతోపాటు కోటిలింగేశ్వర ఆలయాలు విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబు చేశారు. సోమవారం ఉదయం నుంచి ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఎల్ఈడీ ద్వారా భక్తులు వీక్షించే విధంగా ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయా ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వామ్మో చిరుత

- భయాందోళనలో గ్రామాల ప్రజలు

శాపూర్ శివారులో మేకను తిన్న చిరుత

ఖిల్లాఘణపురం, జనవరి 21 : నెలరోజులుగా మండలకేంద్రంలోని మల్కిమియాన్‌పల్లి, కమాలుద్దీన్‌పూర్, పర్వతాపూర్, షాపూర్ తదితర గ్రామాల శివారులో చిరుత సంచరిస్తుండడంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కొన్ని రోజుల కింద మల్కినియాన్‌పల్లి గ్రామ సమీపంలోని బోడగుట్ట వద్ద రెండు చిరుత పులులు గ్రామస్తులకు కనడబడడంతో బెంబేలెత్తుతున్నారు. ఇదిలా ఉండగా రెండు రోజుల కిందట షాపూర్ గ్రామ శివారులో మేకను చిరుత తిని వెళ్లింది. శనివారం పర్వతాపూర్ శివారులోని ఓ రైస్‌మిల్లు వద్ద చిరుత కనిపించినట్లు గ్రామస్తులు తెలిపారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకొని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఫారెస్ట్ రేంజర్ భాస్కరాచారిని వివరణ కోరగా చిరుతను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జాడలు చిరుతవా లేక హైనావా అని అనుమానం. ఇప్పటికే చిరుత ఎక్కడెక్కడ తిరుగుతుందో జాడలు వెతుకుతున్నాం. త్వరలోనే పులిని బంధిస్తాం. ప్రజలు మాత్రం పొలాల వద్దకు వెళ్లినప్పుడు ఒక్కొక్కరు కాకుండా ముగ్గురు ఆపైన వెళ్లాలి. గొర్రెలు, బర్రెల కాపరులు జాగ్రత్తగా ఉండాలి.

కూచిపూడి నృత్య గురువులు, విద్యార్థులకు సన్మానం

వనపర్తి టౌన్, జనవరి 21 : ఇటీవల హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన కూచిపూడి నృత్య బృంద నాట్యంలో నృత్య ప్రదర్శన చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును సాధించిన కూచిపూడి గురువులు, విద్యార్థులను అభినందించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పానుగంటి శారదమ్మ సంస్కార భవన్‌లో సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సాహితీ కళావేదిక అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ మాట్లాడుతూ వనపర్తికి చెందిన 51మంది చిన్నారులు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో డిసెంబర్ 24న నృత్యం చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించారని, అలాంటి కళాకారులను తీర్చిదిద్దిన గురువులను అభినందించడం బాధ్యత అని ఆయన అన్నారు. కొత్తకోట, వనపర్తి పరిధిలో కూచిపూడి నృత్యంతో సేవలందిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్న భక్షి ప్రసన్న, మల్లికార్జున్, సుగుణలను వారు అభినందించారు. అదేవిధంగా వ్యాపారవేత్త ధనలక్ష్మి మాట్లాడుతూ మహిళలను వంటింటికే పరిమితం చేయకుండా అన్ని రంగాల్లో రాణించేలా సహకారం అందించాలని ఆమె సూచించారు. అనంతరం కూడిపూడి నృత్య గురువులు, విద్యార్థులను శాలువా, పూలబొకేలు, మెమెంటోలతో సన్మానించారు. కార్యక్రమంలో సాహితీ కళావేదిక నాయకులు రిటైర్డ్ ఉద్యోగులు నారాయణరెడ్డి, సత్తార్, రాములుయాదవ్, జీహెచ్ఎం చంద్రశేఖర్, బైరోజు చంద్రశేఖర్, గంధం నాగరాజు, శివలింగం ఉన్నారు.

వనపర్తి కవికి..

వనపర్తి టౌన్, జనవరి 21: యూట్యూబ్ చానల్ ఆధ్వర్యంలో హైదరాబాద్ మోడల్ హౌస్‌లో నిర్వహించిన శ్రీమద్రమాయణ కావ్యంపై చర్చా గోష్ఠి నిర్వహించారు. ఈ చర్చా గోష్ఠిలో వనపర్తి జిల్లాకు చెందిన కవి సుధాకరాచారి పాల్గొని రామాయణంలోని ఘట్టాలను వివరించారు. అందుకుగాను యూట్యూబ్ ఛానల్ అధినేత బస్వరాజు సుధాకరాచారిని శాలువా, మెమెంటోలతో సన్మానించారు.

ముదురుతున్న కల్లు పంచాయితీ

- రెండువర్గాల మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణలు
- చోద్యం చూస్తున్న అధికారులు
- ఇరువర్గాలపై ఠాణాల్లో కేసులు నమోదు

గద్వాల అర్బన్, జనవరి 21 : గద్వాల నియోజకవర్గంలో కల్లు పంచాయితీ మొదలైందా.. అంటే.. ప్రస్తుత పరిస్థితులు అవుననే సమాధానం చెబుతున్నాయి. ప్రభుత్వం మారడంతో కల్లు నిర్వహించే వ్యక్తులు కూడా కొత్తగా తెరపైకి వస్తున్నారు. గతంలో నిర్వహించేవారు ఒక వర్గం.. ప్రస్తుతం నూతనంగా ఒకవర్గంగా ఏర్పడ్డాయి. ఈ మధ్య గద్వాల మండలం, ధరూర్, కేటీదొడ్డి తదితర ప్రాంతాల్లోని గ్రామాల్లో కొత్తవర్గం వారు అనుమతి లేకుండా కొత్తగా కల్లు దుకాణాలు ఏర్పాటు చేశారు. వీటికి ఇప్పటివరకు ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహించడం చర్చనీయాంశం. అయితే ఈ మధ్యే గద్వాల మండలంలోని జమ్మిచేడులో ఎలాంటి అనుమతుల్లేకుండా కల్లు దుకాణం ఏర్పాటు చేయడంతో పాతవర్గం వ్యక్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. లైసెన్స్ లేకుండా దుకాణం ఎలా నిర్వహిస్తారంటూ కొత్తవర్గం వ్యక్తులను ప్రశ్నించారు. ఈ క్రమంలో రెండువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకొని కల్లు దుకాణాలు ధ్వంసం చేసుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. అనంతరం రెండు వర్గాల ఫిర్యాదు మేరకు.. గద్వాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో రెండు వర్గాలపై కేసు నమోదు చేశారు.

అనంతరం జిల్లాకేంద్రంలోని నదీఅగ్రహారం సమీపంలో ఒక కల్లు డిపోకు గుర్తు తె లియని వ్యక్తులు నిప్పంటించడంతో మొత్తం దగ్ధమైంది. ఈ క్రమంలో కల్లు డిపో నిర్వాహకుడు కృష్ణయ్యగౌడ్ ఫిర్యా దు మేరకు.. గద్వాల టౌన్ పోలీసులు కేసు నమోదు చేశా రు. కల్లు పంపిణీ విషయంలో రెండువర్గాల మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణలు చోటుచేసుకుంటున్నా.. వాటిని నివారించాల్సిన అబ్కారీ, పోలీస్ అధికారులు ఆ వైపే వెళ్లడం లే దంటూ గుసగుసలు వినిపిస్తున్నాయి. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వ్యక్తుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి చేతు లు దులుపుకొంటున్నారని ఆరోపణలు వినబడుతున్నాయి.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

జిల్లాలో కల్లు పంపిణీ చేసే వ్యక్తులు ఎవరైనా సరే.. లైసెన్స్ ఉంటే నిర్వహించాలి. లైసెన్స్ లేకుండా కల్లు దుకాణం నిర్వహిస్తే తగిన చర్యలు తీసుకుంటాం. ఈ విషయాన్ని ఇప్పటికే ఆబ్కారీ శాఖ అధికారులతోపాటు పోలీస్ ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టాం. వారి సూచనల అనంతరం శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎవరు వ్యవహరించినా వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే గద్వాల రూరల్, గద్వాల టౌన్ పోలీస్‌స్టేషన్లలో కల్లు విషయంలో పలు కేసులు నమోదు చేశాం.

- వెంకటేశ్వర్లు, డీఎస్పీ, జోగులాంబ గద్వాల